క్లుప్తంగా

శ్రీవారి సేవలో...



శ్రీవారి ఆలయంలో ప్రదక్షిణలు చేస్తున్న ఎన్నికల జనరల్ అబ్జర్వర్ రామన్

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయాన్ని కైకలూరు, నూజివీడు, చింతలపూడి, పోలవరం నియోజకవర్గాల ఎన్నికల జనరల్ అబ్జర్వర్ ఎస్‌ఏ రామన్ శనివారం సందర్శించారు. ముందుగా ఆయనకు దేవస్థానం అధికారులు, అర్చకులు తూర్పు రాజగోపురం వద్ద పూర్ణకుంభ స్వాగతం పలికారు. ప్రదక్షిణలు చేసిన అనంతరం ఎస్‌ఏ రామన్ స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు జరుపుకున్నారు. ఆ తరువాత ఆలయ అర్చకులు, పండితులు ఆయనకు శ్రీవారి శేషవస్త్రాన్ని కప్పి, వేద ఆశీర్వచనాన్ని పలుకగా, ఆలయ ఏఈఓ మెట్టపల్లి దుర్గారావు స్వామివారి జ్ఞాపికను, ప్రసాదాలను అందజేశారు. అబ్జర్వర్ వెంట తహసీల్దార్ రవికాంత్, ఎస్సై సతీష్ తదితరులున్నారు.

శ్రీవారి పథకాలకు రూ.3.11 లక్షల విరాళం



జ్యోత్స్నరాణికి విరాళం బాండ్ పత్రాన్ని అందజేస్తున్న సూపరింటెండెంట్ రమణరాజు

ద్వారకాతిరుమల: శ్రీవారి దేవస్థానంలోని నిత్యాన్నదానం, విమానగోపుర స్వర్ణమయ పథకాలకు ముగ్గురు భక్తులు శనివారం వేరు వేరుగా రూ.3,11,346 విరాళంగా అందజేశారు. అందులో భాగంగా గుడివాడకు చెందిన పల్లగాని వెంకటేష్ నిత్యాన్నదాన పథకానికి రూ.1,00,116, ఏలూరుకు చెందిన పట్నాల జ్యోత్స్న రాణి నిత్యాన్నదాన పథకానికి రూ.1,00,116, అనంతపురానికి చెందిన పుచ్చగింజల సాయికుమార్ విమానగోపుర స్వర్ణమయ పథకానికి రూ. 1,11,114 విరాళంగా అందజేశారు. దాతలకు ఆలయ ఏఈఓ మెట్టపల్లి దుర్గారావు, సూపరింటెండెంట్‌లు రమణరాజు, డీవీఎస్ రాజు విరాళం బాండ్ పత్రాలను అందించారు. అనంతరం దాత కుటుంబాలకు స్వామివారి ప్రత్యేక దర్శన భాగ్యాన్ని కల్పించారు.

ఆర్యవైశ్య నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.3 లక్షల విరాళం



విరాళం చెక్కును అందజేస్తున్న దాత విజయలక్ష్మి

ద్వారకాతిరుమల: క్షేత్రంలోని ఆర్యవైశ్య కల్యాణ మండప ట్రస్టు నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి ఒక భక్తురాలు శనివారం రూ.3 లక్షలు విరాళంగా అందజేశారు. హైదరాబాద్‌కు చెందిన కలువ విజయలక్ష్మి ముందుగా కన్యకాపరమేశ్వరి అమ్మవారిని దర్శించి ప్రత్యేక పూజలు జరుపుకున్నారు. అనంతరం ఈ విరాళం చెక్కును ట్రస్టు చైర్మన్ బొండాడ రామ్మోహన్‌రావు, యిమ్మడి రత్నాజీలకు అందించారు. ఈ సందర్భంగా దాతను వారు ప్రత్యేకంగా అభినందించారు.

13 మంది వలంటీర్ల రాజీనామా



రాజీనామా పత్రాలను ఎంపీడీవోకు అందజేస్తున్న పెదరావిగూడెం వలంటీర్లు

కుక్కునూరు: ఎన్నికలు సమీపిస్తున్న వేళ జగనన్నకు మద్దతుగా పెదరావిగూడెం పంచాయతీకి చెందిన 13 మంది వలంటీర్లు మూకుమ్మడిగా రాజీనామా చేశారు. తమ రాజీనామా పత్రాలను ఇన్‌చార్జి ఎంపీడీవో నరసింహారావుకు శనివారం అందజేశారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించుకునేందుకు తమ వంతు కృషి చేస్తామన్నారు.

ఐఎస్ జగన్నాథపురంలో...



రాజీనామా పత్రాలను చూపుతున్న వలంటీర్లు

ద్వారకాతిరుమల: వలంటీర్లుగా సేవలందించి ప్రజల మన్ననలను పొందిన తామంతా ప్రతిపక్ష పార్టీల ఈర్ష్య, ద్వేషాలకు బలై రాజీనామాలు చేశామని ఐఎస్ జగన్నాథపురం వలంటీర్లు తెలిపారు. అందులో భాగంగా వలంటీర్లు పి.బాలాజీ, పంపన జగదీష్, పసుపులేటి సాయి, పసుపులేటి సురేష్, పి.సుబ్రహ్మణ్యం తమ రాజీనామా పత్రాలను గ్రామ పంచాయతీ కార్యదర్శి ఇడ గౌతమికి శనివారం అందజేశారు. మే 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయం సాధించేలా తాము కృషి చేస్తామన్నారు.

గిరిపల్లెలకూ ఫ్యామిలీ డాక్టర్

- మారుమూల కొండ గ్రామాల్లో ఇంటి వద్ద రోగులకు వైద్య సేవలు
- అందుబాటులో 67 రకాల మందులు
- క్షేత్ర స్థాయిలో 14 రకాల వైద్య పరీక్షలు
- నియోజకవర్గంలో 80 హెల్త్ క్లినిక్‌ల ఏర్పాటు
- హర్షం వ్యక్తం చేస్తున్న గిరిపుత్రులు



అటవీప్రాంతంలో కాలినడకన వెళ్తున్న డాక్టర్‌లు, వైద్య బృందం (ఫైల్)



రేపల్లెలో చిన్నపిల్లలకు వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం (ఫైల్)



దోలుగండిలో వైద్య సేవలు అందిస్తున్న దృశ్యం(ఫైల్)

బుట్టాయగూడెం: సంపన్న వర్గాలకే పరిమితమైన ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ ఇప్పుడు సామాన్య ప్రజలకు చేరువైంది. ప్రతి పేదవాడికి మెరుగైన వైద్యం అందుబాటులో ఉండాలనే సంకల్పంతో ప్రభుత్వం వైద్య సేవల్లో నూతన విధానానికి శ్రీకారం చుట్టింది. దీనిలో భాగంగా ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌తో వైద్యులే ఇంటికి వచ్చి సేవలందించే విధంగా ఏర్పాటు చేయడం జరిగింది. ఈ ఫ్యామిలీ డాక్టర్ గిరిజన ప్రాంత ఆదివాసీ గిరిజనులకు వరంగా మారింది. గతంలో మారుమూల కొండ ప్రాంతాల్లో నివసిస్తున్న కొండరెడ్డి గిరిజనులకు అనారోగ్య సమస్యలు తలెత్తితే మైళ్ల దూరం కొండలు, గుట్టలు దాటుకుంటూ కాలినడకన నడుచు కుంటూ అందుబాటులో ఉన్న ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చి వైద్యం చేయించుకునేవారు. ఇప్పుడు ఆ పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. డాక్టర్లే కాలి బాటలో నడుచుకుంటూ కొండలు, గుట్టలు దాటుకుంటూ గ్రామాల్లోకి వెళ్లి గిరిజనుల ఇంటింటికి వెళ్లి వైద్య సేవలు అందిస్తున్నారు. ఇంటి వద్దకే వచ్చి డాక్టర్లు వైద్య సేవలు అందించాలనే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పం పట్ల కొండరెడ్డి గిరిజనులు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

ఇంటి వద్దకే డాక్టర్, సిబ్బంది

అనారోగ్యంతో బాధపడుతూ నడవలేని వారు మంచానికే పరిమితమైన వారు, పక్షవాతంతో ఉన్నవారు, ఆరోగ్యశ్రీ పథకంలో ఆపరేషన్ చేయించుకొని ఇంటి వద్ద విశ్రాంతిలో ఉన్నవారు నిండు గర్భిణులు, చిన్న పిల్లలు వంటి వారి వద్దకు డాక్టర్, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్‌ఎం ఇతర వైద్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి వైద్య సేవలు అందిస్తున్నారు. మందులు ఉచితంగా ఇస్తున్నారు. అలాగే ఎవ్వరికైనా అత్యవసర వైద్య సేవలు అవసరమైతే అందుబాటులో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రులకు రిఫర్ చేస్తున్నారు. ఇప్పటివరకూ నియోజకవర్గ పరిధిలో సుమారు 600 వరకూ గర్భవతులు, 480 మంది బాలింతలు, 1400 మంది జ్వరపీడితులు, సుమారు 2300 మందికిపైగా చిన్నారులు అలాగే 4000 మందికిపైగా హిమోగ్లోబిన్ టెస్టులు చేసినట్లు అధికారులు తెలిపారు. అలాగే పేదలకు వైద్య సేవలు అందుబాటులో అందించేలా పోలవరం నియోజకవర్గంలోని 7 మండలాల పరిధిలో 80 విలేజ్‌క్లీనిక్స్ భవనాలు ఏర్పాటు చేయడం జరిగింది.



రేగులపాడులో పసిపాపకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు (ఫైల్)

మెరుగైన వైద్యసేవలు



గ్రామ స్థాయిలోనే ప్రతి పేషెంట్‌కు మెరుగైన వైద్యసేవలు అందుతున్నాయి. ప్రభుత్వం ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌ను తీసుకువచ్చింది. ఇది మారుమూల గిరిజన ప్రాంత ప్రజలకు ఒక వరంలా మారింది. డాక్టర్‌లే మా ఇళ్ల వద్దకు వచ్చి ప్రాథమికమైన అన్ని రకాల వైద్యసేవలు అందించేలా కృషి చేస్తున్నారు.

– మందకం వెంకటేష్, అలివేరు గ్రామం, బుట్టాయగూడెం మండలం

ఇంటి ముంగిటకే వైద్యం



గ్రామాల్లోని అన్ని రకాల రోగాలకు డాక్టర్‌లు ఇంటికి వచ్చి వైద్యసేవలు అందించడం దేశ చరిత్రలోనే ఎక్కడాలేదు. ప్రభుత్వం పేదలకు మెరుగైన వైద్యసేవలు అందించేలా కృషి చేస్తోంది. మారుమూల గిరిజన గ్రామాల్లోని ప్రజలకు ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ ఎంతో ఉపయోగకరంగా ఉంది.

– కుంజా భూమయ్య, బూరుగువాడ గ్రామం, బుట్టాయగూడెం మండలం

ఉచితంగా 14 రకాల వైద్యసేవలు



గతంలో మేము అనారోగ్యం బారిన పడితే ఆస్పత్రులకు పరుగులు తీసేవాళ్లం. ప్రస్తుతం ప్రభుత్వ ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ ఏర్పాటు చేయడంతో 14 రకాల వైద్య పరీక్షలు మా ఇళ్ల వద్దే చేయడంతోపాటు మందులు కూడా ఇస్తున్నారు.

– కె. కన్నపరాజు, కామవరం గ్రామం, బుట్టాయగూడెం మండలం

పోలింగ్ బూత్ పరిశీలన



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న శ్రీరామన్

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెంలో జెడ్పీ బాలుర, జెడ్పీ బాలికల హైస్కూళ్లలో ఉన్న పోలింగ్ కేంద్రాలను అబ్జర్వర్ శ్రీరామన్ పరిశీలించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాల వద్ద టెంట్‌లను, మంచినీటి సౌకర్యాలు, వైద్యశిబిరాలను ఏర్పాటు చేయాలని స్థానిక అధికారులకు సూచించారు. అనంతరం స్థానిక పారిజాతగిరి, మద్ది ఆలయాలను ఆలయాన్ని సందర్శించి పూజలు నిర్వహించారు. ఈయన వెంట మున్సిపల్ కమిషనర్ నరేంద్రకుమార్, డిప్యూటీ తహసీల్దార్ కె.రమేష్, మున్సిపల్ ఏఈ సంధ్యారాణి, టీపీవో వెంకట్రావు, వీఆర్వోలు, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

‘లంచాలు తీసుకున్నదెవరో దమ్ముంటే నిరూపించు’



సమావేశంలో మాట్లాడుతున్న విజయరాజు

చింతలపూడి: తాను ఎవరి దగ్గర లంచాలు తీసుకున్నానో దమ్ముంటే నిరూపించాలని చింతలపూడి వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కంభం విజయరాజు సవాల్ విసిరారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శనివారం పార్టీ మండల అధ్యక్షురాలు జగ్గవరపు జానకిరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీ అభ్యర్థి సొంగా రోషన్‌కుమార్ తనపై చేసిన ఆరోపణలను ఆయన తీవ్రంగా ఖండించారు. తనకు సంస్కారం ఉందని ఎన్నికల నిబంధనలను అనుసరించి తాను ఇంతవరకు వ్యక్తిగత విమర్శలు చేయలేదన్నారు. నీపై ఆరోపణ చేసిన వారిపై నువ్వు మాట్లాడితే బాగుంటుంది, ఎవరు చేసినా దాని వెనుకాల విజయరాజు హస్తము ఉందని మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఫోర్త్ గేరేసి వెళ్లడానికి అసలు సైకిల్‌కి గేర్లు ఉన్నాయో లేదో సరిగ్గా చూసుకోవాలన్నారు. బూత్‌ల్లో ఓటర్లు లేకుండా చేస్తానని చెప్పడం కాదని.. దమ్ము ధైర్యం ఉంటే చేసి చూపించాలన్నారు. సింహం సింగిల్‌గా వెళ్తుంటే ఊర కుక్కలు ఎన్నో మొరుగుతాయని, వాటిని పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నారు. చింతలపూడి నియోజకవర్గంలో ఎస్సీలంతా ఒకటిగా జీవిస్తూ ఒకే తాటిపై నడుస్తుంటే వారి మధ్య గొడవలు సృష్టిస్తుంది నువ్వు కాదా అని ప్రశ్నించారు. ఎన్నికలైన తర్వాత నువ్వు మూట ముళ్ళు సదురుకుని మళ్లీ అమెరికా పోతావు, అమాయక ప్రజల మధ్య గొడవలు చిచ్చులు పెట్టడం సరి కాదని విజయరాజు హితవు పలికారు. సమావేశంలో ఏఎంసీ చైర్‌పర్సన్ జె జానకిరెడ్డి, జెడ్పీటీసీ ఎం నీరజా సుధాకర్, ఎంపీపీ డా.బి రాంబాబు నాయక్, పార్టీ లింగపాలెం మండల అధక్షుడు కొఠారు మోహన్‌రావు, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు మట్టా సురేష్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ విజయానికి సమష్టిగా కృషి చేయాలి



వేలేరుపాడులో జగనన్న మేనిఫెస్టోను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే తెల్లం బాలరాజు




లింగపాలెంలో బూత్ కమిటీల సమావేశంలో మాట్లాడుతున్న కంభం విజయరాజు

వేలేరుపాడు: సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి కార్యకర్తలు ఐక్యంగా ప్రచారం చేయాలని పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు పిలుపునిచ్చారు. శనివారం వేలేరుపాడు మండల కేంద్రంలో జరిగిన పోలింగ్‌బూత్ కన్వీనర్ల సమావేశంలో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రానున్న 13 రోజులపాటు రోజూ 22 పోలింగ్ బూత్‌ల పరిధిలో ఇంటింటికీ వెళ్లి జగనన్న ప్రవేశపెట్టిన మేనిఫెస్టో వివరాలను బూత్ కన్వీనర్లు ప్రజల్లో ప్రచారం చేయాలని కోరారు. రాజీనామా చేసిన వలంటీర్లు, బూత్ కన్వీనర్‌లు, స్థానిక నాయకుల సమన్వయంతో పార్టీ విజయానికి కృషి చేయాలన్నారు. ఇప్పటివరకు వేలేరుపాడు మండలంలో 30 మంది వలంటీర్లు రాజీనామాలు చేశారని, రాజీనామాలు చేసిన వలంటీర్లకు ప్రభుత్వం అండగా ఉంటుందని, ఎలాంటి అపోహలకు తావివ్వద్దని హితవు పలికారు. మళ్లీ జగనన్న ముఖ్యమంత్రి అయ్యాక తప్పకుండా రాజీనామాలు చేసిన వారందరినీ విధుల్లో తీసుకుంటారని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పోలవరం నియోజకవర్గ పార్టీ పరిశీలకులు జెట్టి గురునాథం, ఎంపీపీ వాళ్ళ లక్ష్మీదేవి, వైస్ ఎంపీపీ మేడవరపు నాగశ్రీ, కేసగాని వెంకటేశ్వరమ్మ, జెడ్పీటీసీ గుజ్జా రామలక్ష్మి, సర్పంచ్‌లు కట్టి ఉదయ్‌కిరణ్, లక్ష్మణ్, ఎంపీటీసీ సభ్యులు కొమ్మరాజు రాంబాబు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కేసగాని శ్రీనివాసగౌడ్, కామినేని వెంకటేశ్వరరావు. ఎస్‌కే షౌకత్ హుస్సేన్, కొలూరి సత్తిరాజు, ఆరిఫ్, చిన్ని, రాము, మెండెం కుమార్, శెట్టిపల్లి శ్రీనివాసరావు, చక్రి తదితరులు పాల్గొన్నారు.


బూత్ కమిటీలు సమర్థవంతంగా పనిచేయాలి

లింగపాలెం: పోలింగ్ సమయంలో బూత్ కమిటీలు సమర్థవంతంగా పనిచేయాలని వైఎస్సార్ సీపీ చింతలపూడి ఎమ్మెల్యే అభ్యర్థి కంభం విజయరాజు అన్నారు. శనివారం లింగపాలెంలో నిర్వహించిన మండల బూత్ కమిటీల సమావేశంలో ఆయన మాట్లాడారు. బూత్ కమిటీ సభ్యులు ప్రతి ఇంటికి వెళ్లి పార్టీ పథకాలు వివరించి, ప్రతి ఒక్కరిని ఒక స్టార్ క్యాంపైనర్‌గా చేయాలన్నారు. వారం రోజుల్లో బూత్ కమిటీలు ప్రతీ గ్రామంలో అన్ని గృహాలకు వెళ్లి సమాచారాన్ని పూర్తి చేయాలని ఆయన తెలిపారు. ఆయా గ్రామాల సర్పంచ్‌లు శ్రద్ధ తీసుకుని బాధ్యతగా పార్టీ కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు భీమిరెడ్డి వెంకట సూరారెడ్డి, రాష్ట్ర లేబర్ వెల్ఫేర్ బోర్డు వైస్ చైర్మన్ దయ్యాల నవీన్‌బాబు, మాజీ ఏఎంసీ చైర్మన్ మందలపు సాయిబాబ, మండల అధ్యక్షుడు కొఠారి మోహన్, వైస్ ఎంపీపీ మట్టా సురేష్, మండల సచివాలయ కన్వీనర్ అన్నపనేని శాంతారావు, మండల బూత్ కన్వీనర్ ఉప్పలపాటి గోపి, మాజీ జెడ్పీటీసీ కట్టా సత్యనారాయణ, మేకల రాజు, బి.ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీతోనే అభివృద్ధి, సంక్షేమం



కొత్తూరులో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎంపీపీ విజయలక్ష్మి, పార్టీ శ్రేణులు



చింతలపూడి నగర పంచాయతీ పరిధిలో వైఎస్సార్ సీపీ నేతల ప్రచారం

కామవరపుకోట: పేదల అభివృద్ధి, సంక్షేమం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనే సాధ్యమని ఎంపీపీ మేడవరపు విజయలక్ష్మి అన్నారు. శనివారం కొత్తూరులో ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓట్లు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. ప్రజలకు ఇంకా మేలు జరగాలన్న, వారు ఆర్థిక అభివృద్ధి సాధించాలన్నా వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని మరలా అధికారంలోకి తీసుకురావాలని ఆమె కోరారు. పార్టీ మండల కన్వీనర్ మిడతా రమేష్ బాబు, సర్పంచ్ కర్రిపోతు అనూష భాగ్యరాజ్, ఉప సర్పంచ్ మేడూరు రంగబాబు, వైస్ ఎంపీపీ తమ్మిశెట్టి గిరిజ, రాష్ట్ర ముతరాజ్ సంఘ డైరెక్టర్ చిక్కుల శ్రీను, మేడంకి పద్మ, ఎస్‌కే కరిముల్లా, తమ్మిశెట్టి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

జగన్ రుణం తీర్చుకోవాలి

చింతలపూడి: ప్రజల సంక్షేమానికి ఎన్నో పథకాలు అమలు చేస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రుణం తీర్చుకోవాలంటే ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఏఎంసీ చైర్‌పర్సన్ జగ్గవరపు జానకిరెడ్డి విజ్ఞప్తి చేశారు. చింతలపూడి నగర పంచాయతీ పరిధిలోని ఛార్లెస్‌నగర్, తుక్కులూరు, వెంకట్రామా బాగ్‌లలో శనివారం పార్టీ శ్రేణులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. జెడ్పీటీసీ ఎం నీరజా, ఎం.రాంబాబు, బి.చెంచమరాజు, కొప్పుల నాగేశ్వరరావు, బొడ్డు వెంకటేశ్వరావు, మాధవరెడ్డి, వెంపా కృష్ణ, బండారు గోపి, ఎ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

మాట నిలబెట్టుకోవడంలో జగనన్నకు సాటిలేరు



మారేడుబాకలో ఓటు అభ్యర్థిస్తున్న తెల్లం రాజ్యలక్ష్మి

కుక్కునూరు: రాష్ట్ర రాజకీయ చరిత్రలో ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడంలో జగనన్నకు మించిన నాయకుడు లేరని పోలవరం ఎమ్మెల్యే అభ్యర్థి తెల్లం రాజ్యలక్ష్మి పేర్కొన్నారు. శనివారం ఆమె మండలంలోని గణపవరం, ఇబ్రహీంపేట, మారేడుబాక, గోపరాజుగూడెం కివ్వాక తదితర గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు హారతులతో ఘనంగా స్వాగతం పలికారు. రాజ్యలక్ష్మి ప్రతి వీధి తిరుగుతూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జగనన్న మేనిఫెస్టోను పవిత్ర గ్రంథంగా భావిస్తారని, గతంలో 2019లో ఇచ్చిన హామీలను 99శాతం అమలు చేసిన ఆయన ఈసారి కూడా మేనిఫెస్టోలో పేర్కొన్న హామీ ప్రతి ఒక్కదానిని అమలు చేస్తారన్నారు. జగనన్న ప్రభుత్వంలో నిర్వాసితులకు పూర్తిస్థాయిలో న్యాయం జరుగుతుందని ఆమె భరోసా ఇచ్చారు. మరోసారి జగనన్నను ముఖ్యమంత్రిగా చేసుకుందామని, ప్రతి ఒక్కరూ తమ రెండు ఓట్లను ఫ్యాన్ గుర్తుకు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కుంజా నాగేశ్వరరావు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మాదిరాజు వెంకన్నబాబు, గంగుల రమణారెడ్డి, ఎంపీటీసీ సూరిబాబు, సర్పంచ్ రావు మీనా, వైస్ ఎంపీపీ గాడిద రామచంద్రం, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు కుచ్చర్లపాటి నరసింహరాజు, ఎల్లంకి లక్ష్మణరావు, గాడిద రాంబాబు, తుర్సం నరేష్, రాయి సత్యనారాయణ, రాయి రవి, బట్టు వీరబాబు, చిలకల కృష్ణార్జునరావు, రావి వినోద్, పరవా రామిరెడ్డి, మడివి రాజులు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్‌లు పాల్గొన్నారు.

టేబుళ్లు, కుర్చీల బహూకరణ

జంగారెడ్డిగూడెం: స్థానిక ఛత్రపతి శివాజీ త్రి శతజయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాల లైబ్రరీకి మూడు టేబుళ్లు, పన్నెండు కుర్చీలను కళాశాల అధ్యాపకుడు యు.వెంకటాచార్యులు బహూకరించారు. ఆయనకు కళాశాల ప్రిన్సిపాల్ డా.ఎస్ ప్రసాద్ బాబు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

29న నామినేషన్ల ఉపసంహరణ

బుట్టాయగూడెం: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి పోలవరం అసెంబ్లీకి నామినేషన్లు ఆమోదం పొందిన అభ్యర్థుల్లో ఎవరైనా నామినేషన్‌ను ఉపసంహరించుకోవాలనుకుంటే ఈ నెల 29వ తేదీన తమ ఉపసంహరణ పత్రాన్ని సమర్పించాలని ఐటీడీఏ పీఓ, ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎం. సూర్యతేజ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 29వ తేదీ ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ ఉపసంహరణ చేసుకునేవారి నుంచి పత్రాలను స్వీకరించడం జరుగుతుందని చెప్పారు.

బడుగు, బలహీన వర్గాల అభివృద్ధే లక్ష్యం



కొత్తూరులో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న దళిత నాయకులు

కామవరపుకోట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన మేనిఫెస్టోలో దళితవాడలను ప్రత్యేక పంచాయతీలుగా ఏర్పాటు చేస్తానని ప్రకటించడం పట్ల మండలంలో దళిత నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కొత్తూరులోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వైఎస్సార్‌సీపీ మండల టౌన్ కన్వీనర్ నానాది సాగర్ మాట్లాడుతూ గతంలో ఎన్నడూలేని విధంగా సీఎం వైఎస్ జగన్ బడుగు, బలహీన వర్గాలు అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో దళితవాడలను ప్రత్యేక పంచాయతీలుగా ఏర్పాటు చేసేందుకు తీసుకున్న నిర్ణయం చరిత్రాత్మకమని అన్నారు. సీఎం జగన్‌తోనే పేదల అభివృద్ధి సాధ్యమని, అందుకే ఫ్యాన్ గుర్తుకు ఓటేసి మరల ఆయన్ను సీఎం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు డాక్టర్ రామకృష్ణ, జిల్లా ఎస్సీ ఎస్టీ కేసుల మోనిటరింగ్ మెంబర్ గుర్రాల రవికుమార్, గంగు ప్రసాద్‌రెడ్డి, సాల్మన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పంచాయతీ నిర్ణయం చరిత్రాత్మకం



దళిత వాడలను ప్రత్యేక పంచాయతీలుగా ఏర్పాటు చేస్తానని సీఎం వైఎస్ జగన్ మేనిఫెస్టోలో ప్రకటించడం చరిత్రాత్మక నిర్ణయం. ఈ హామీ భవిష్యత్తులో దళితుల తలరాతను మారుస్తుంది. దళితులందరూ సీఎం జగన్‌కు అండగా నిలవాలి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని మరోసారి అధికారంలోకి తీసుకురావాలి.

– గుర్రాల రవికుమార్, జిల్లా ఎస్సీ ఎస్టీ కేసుల మోనిటరింగ్ మెంబర్, వీరిశెట్టిగూడెం

మేనిఫెస్టో బాగుంది



సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన మేనిఫెస్టో బాగుంది. అన్ని వర్గాలకు సముచిత స్థానం కల్పించారు. గతంలోలాగే ఈసారి కూడా జగనన్న ఎన్నికల మేనిఫెస్టోను నూరుశాతం అమలు చేస్తారు. చంద్రబాబుది మాయ మేనిఫెస్టో. ఆచర సాధ్యంకాని హామీలు ఇచ్చి ఆ తరువాత వాటిని వదిలేయడం మనకు తెలిసిందే. చేయలేని ఏ హామీని జగన్‌మోహన్‌రెడ్డి ఇవ్వరు.

– బత్తిన లక్ష్మి, మున్సిపల్ చైర్‌పర్సన్, జంగారెడ్డిగూడెం

ప్రజలు నమ్మేలా ఉంది



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విడుదల చేసిన మేనిఫెస్టో ప్రజలు నమ్మే నిజమైన మేనిఫెస్టో. జగన్‌మోహన్ రెడ్డి చెప్పింది చేస్తారని ప్రజలు నమ్ముతున్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా చంద్రబాబు మోసం చేస్తే, ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చి ప్రజల మన్ననలను జగన్‌మోహన్‌రెడ్డి పొందారు. చంద్రబాబును ప్రజలు నమ్మే స్థితిలో లేరు.

– వల్లూరి శ్రీకాంత్, మైసన్నగూడెం

పారిజాతగిరిలో పూజలు

జంగారెడ్డిగూడెం: స్థానిక గోకుల తిరుమల పారిజాతగిరి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధానార్చకులు నల్లూరి రవికుమారాచార్యులు ఆధ్వర్యంలో ఆరాధన, తీర్థప్రసాదగోష్ఠి, బాలభోగ నివేదన తదితర పూజలు నిర్వహించారు. భక్తులు, విద్యార్థులు స్వామివారిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు. గద్దే సీతారామచంద్రమూర్తి జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఉచిత మజ్జిగ పంపిణీ చేశారు.

విశేషాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చిన పారిజాతగిరిలో కొలువైన శ్రీవేంకటేశ్వరస్వామి →

